సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 21 । జూలై । 2023



ఎందుకీ సమావేశాలు?

సమస్యలు పరిష్కారం చేయలేని సమావేశాలు ఎందుకు అని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. 8లో ▸



డివైడర్లు సరే..

విస్తరణ పనులు చేపట్టకుండానే డివైడర్లు ఏర్పాటు చేశారు. కానీ రోడ్డు మధ్యలో విద్యుత్ దీపాలు మరిచారు. 8లో ▸



ఉపయోగం లేని..

డబుల్ బెడ్రూంలవల్ల ఎవరికీ ఉపయోగం లేదని బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య అన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

డిగ్రీ కాలేజీలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులు

తాండూరు టౌన్: తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, వాణిజ్యశాస్త్రం రెండు పోస్టుల చొప్పున, వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం, రసాయన శాస్త్రం, గణిత శాస్త్రం, రాజనీతిశాస్త్రం ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 55 శాతానికి పైగా మార్కులు ఉన్న వారు అర్హులని, పీహెచ్‌డీ, నెట్, సెట్‌తో పాటు బోధనా రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 24న సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీజేపీ నాయకుల హౌస్ అరెస్ట్



బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్ రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

వికారాబాద్ అర్బన్: నగరంలోని బాటసింగారంలో డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డిని, నాయకులను పోలీసులు గురువారం హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సదానంద్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అరెస్టులు చేస్తోందని ఆరోపించారు. కనీసం నిరసనలు చెప్పే హక్కును కూడా ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ తీరు పూర్తి నిరంకుశంగా ఉందని, ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా పోరాటం ఆగదన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి, మాట మార్చిన ప్రభుత్వానికి ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదన్నారు.

టైలరింగ్, మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

ధారూరు: గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు భారతీయ స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ చిలుకూరు సంచాలకులు కె.రమేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19- 45 ఏళ్లలోపు వయస్సున్న మహిళలు అర్హులని తెలిపారు. దరఖాస్తుదారులు బ్యాంకు పాసుబుక్కు, ఎస్సెస్సీ మెమో, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలను జత చేసి సమర్పించాలన్నారు. నెల రోజులు శిక్షణ ఉంటుందని, ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 86390 79122, 90007 78300 నంబర్లను సంప్రదించాలన్నారు.

సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలి

మంత్రి కేటీఆర్‌ను కోరిన లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు



మంత్రి కేటీఆర్‌ను కలిసిన లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

షాద్‌నగర్: రెండు తెలుగు రాష్ట్రాల రవాణా రంగంలో సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలని లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్, ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ తదితరులు సెక్రటేరియేట్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సయ్యద్ సాధిక్ మాట్లాడుతూ.. సింగిల్ పర్మిట్ విధానం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వాహనాల ఫిట్‌నెస్ ఫీజులను తగ్గించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఫిట్‌నెస్ ఫీజులు అధికంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు రాంచంద్రారెడ్డి, చాంద్‌పాషా, సుధాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ధారూరు: కాగ్నా నది వద్ద పోలీసుల పహారా



భారీ వర్షాలకు అనంతగిరి కొండల్లోంచి ప్రవహిస్తున్న వరద



తాండూరు రూరల్: ఐనెల్లివాగు ఉధృతికి నిలిచిన రాకపోకలు

జడివాన

జిల్లాను ముంచెత్తిన వర్షాలు

- ఈ సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- అధికారులతో కలెక్టర్ సమీక్ష
- పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ఎస్పీ

ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నంబర్లు
7995061192, డయల్ 100



తాండూరు పట్టణ శివారులో రహదారిని ఆనుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న కాగ్నానది

వికారాబాద్: జిల్లాలో వర్షం దంచి కొట్టింది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన గురువారం ఉధృతంగా మారింది. దీంతో జన జీవనం స్తంభించింది. వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద నీరు పోటెత్తుతోంది. వరదల నేపథ్యంలో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలిగింది. గడిచిన 24 గంటల్లో మర్పల్లిలో అత్యధికంగా 56.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అధికారులకు ఆదేశాలు

భారీ వర్షాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత శాఖలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సెట్ కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లాలోని వాగులు, వంకలు, బ్రిడ్జిల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందికి విధులు కేటాయించారు. రోజంతా పహారా కాస్తున్నారు. వర్షాలు తగ్గే వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు సూచించారు.

- జిల్లాలోని కోట్‌పల్లి, లఖ్నాపూర్, జుంటుపల్లి, శివసాగర్, శివారెడ్డిపేట్ ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా చేరుతోంది. పలు చోట్ల ఇళ్లు కూలాయి.
- కాగ్నా, మూసీ, ఈసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.
- ధారూరు మండలం దోర్నాల- పరిగి, ధన్నారం మార్గాల్లో వరద నీరు వంతెనల పైనుంచి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- వర్షం తాకిడికి పలు చోట్ల రోడ్లకు గండ్లు పడ్డాయి. వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి.
- వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది.

వర్షపాతం ఇలా..

గడిచిన 24 గంటల్లో మర్పల్లిలో 56.1 మిల్లీమీటర్లు, మోమిన్‌పేట్ 54.1 మి.మీ, నవాబుపేట 52.4, వికారాబాద్ 37.9, పూడూరు 51.2, పరిగి 19.8, కుల్కచర్ల 0.17, దోమ 2.9, బొంరాస్‌పేట 13.5, ధారూరు 36.7, కోట్‌పల్లి 35.4, బంట్వారం 29.1, పెద్దేముల్ 0.32, తాండూరు 32.7, బషీరాబాద్ 17.8, యాలాల 0.27, కొడంగల్ 17.6, దౌల్తాబాద్ 19.8, చౌడాపూర్ 13.8, దుద్యాలలో 20.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నదుల వద్ద బారికేడ్ల ఏర్పాటు

యాలాల: కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని కోకట్, తాండూరు కాగ్నా బ్రిడ్జిల వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్‌ఐ అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో నదుల వద్ద భద్రతను పటిష్టం చేశారు. వాహనాలు, ప్రజలు వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. కోకట్ కాగ్నా బ్రిడ్జి సమీపంలో కానిస్టేబుళ్లను నియమించారు. నదుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



తాండూరు పాత కాగ్నా బ్రిడ్జివద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



ధారూరు: చెరువును తలపిస్తున్న పంటపొలాలు



పెద్దేముల్: వరద నీటిలో గోపాల్‌పూర్ జీపీ

24/7 అత్యవసర సేవలు



అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నాం. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. 24/7 సేవలు అందుబాటులో ఉండేలా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా ఆదేశాలు ఇచ్చాం. ప్రజలు జలాశయాలు, వాగుల వద్దకు వెళ్లొద్దు. అత్యవసర సమయాల్లో 79950 61192 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

– నారాయణరెడ్డి, కలెక్టర్

కరెంటుకు దూరంగా ఉండాలి



వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసు శాఖ తరఫున తగిన సహకారం అందిస్తాం. అత్యవసర పరిస్థితిలో 100కు డయల్ చేయండి. ఉధృతంగా ప్రవహించే అన్ని వాగులు, ప్రాజెక్టుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. కరెంటు పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. పంట పొలాల వద్ద మోటార్లు, స్టార్టర్లను ముట్టుకోవద్దు. వాగులు దాటే ప్రయత్నాలు చేయొద్దు. శిథిలావస్థకు చేరిన ఇళ్లకు దూరంగా ఉండాలి.

– కోటిరెడ్డి, ఎస్పీ

'బెస్ట్ అవైలబుల్'కు విద్యార్థుల ఎంపిక

- పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వం కల్పించే బెస్ట్ అవైలబుల్ పాఠశాల ప్రవేశాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాల ప్రవేశాల కోసం డ్రా పద్ధతిన ఎంపిక చేశారు. జిల్లా నుంచి 139 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా తల్లిదండ్రుల సమక్షంలో 88 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. 5వ తరగతిలో చేరేందుకు 61 మంది దరఖాస్తు చేసుకోగా అందిరినీ ఎంపిక చేశామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 22న ఎంపిక పత్రాలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కూటి కోసం కూలికెళ్తే..

- భారీ క్రేన్ పైనపడి వ్యక్తి దుర్మరణం
- స్టీల్ ఫ్యాక్టరీలో దారుణం
- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ



రాములు (ఫైల్)

పరిగి: పొట్టకూటి కోసం ఓ ఫ్యాక్టరీలో కూలికి వెళ్లిన వ్యక్తిని మృత్యువు కబళించింది. భారీ క్రేన్ పైనపడటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన లక్ష్మీదేవిపల్లిలోని సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండలం ఇంతగుంట గ్రామానికి చెందిన రాములు(30) పరిగి మండలం లక్ష్మీదేవిపల్లిలోని సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో కూలి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి క్రేన్ సాయంతో స్టీల్ లోడ్ చేస్తుండగా ఒక్కసారిగా క్రేన్ పైన పడింది. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే మా కుమారుడు మృతి చెందాడని మృతుని బంధువులు వాపోయారు. ఫ్యాక్టరీలో గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వారు తెలిపారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్నప్పుడు ఎలాంటి భద్రతలు యాజమాన్యం పాటించడంలేదని వారు మండిపడ్డారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

లక్ష్మీదేవిపల్లిలోని సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో ఎలాంటి భద్రతా చర్యలు కానరావడంలేదని, కూలీ మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం బాధ్యతా రహితంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రతి ఏటా ఒకరిద్దరు మృతి చెందుతున్నా యాజమాన్యం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కంపెనీలో సేఫ్టీ పరికరాలు ఏమీ లేకుండానే పనులు చేయిస్తున్నారన్నారు. కార్మికులపై ఒత్తిడి తీసుకువచ్చి పనులను చేయిస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వెంటనే ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్తయ్య, యాదగిరి, శేఖర్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు సీపీఎం నాయకుల వినతిపత్రం

లక్ష్యం.. 40.49 లక్షల మొక్కలు

- 9వ హరితహారానికి సర్వం సిద్ధం
- మొక్కలు నాటేందుకు అనువైన వాతావరణం
- ఏర్పాట్లలో అధికారులు బిజీ



హరితహారం కోసం నర్సరీలో పెంచుతున్న మొక్కలు

వికారాబాద్ అర్బన్: నాలుగు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో తొమ్మిదవ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం ప్రారంభమైంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో హరితహారం కార్యక్రమం చేపట్టడంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ సమయంలో మొక్కలు నాటాలని అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

34 శాఖలకు నిర్దేశం

తొమ్మిదవ విడత హరితహారం కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 40.49 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. లక్ష్యాన్ని చేరేందుకు కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఇప్పటికే 34 ప్రభుత్వ శాఖలకు లక్ష్యాన్ని నిర్దేశించారు. పలు మార్లు సమీక్షలు కూడా నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ఈజీఎస్, ఫారెస్టు నర్సరీల నుంచి మొక్కలను తీసుకెళ్లి నాటాలని, లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు.

తగ్గిన లక్ష్యం

తొమ్మిదవ విడత హరితహార కార్యక్రమానికి మొక్కలు నాటే లక్ష్యం భారీగా తగ్గింది. గత ఏడాది 50.50లక్షలు లక్ష్యం నిర్దేశించగా ఈ ఏడాది కేవలం 40.49 లక్షలు మాత్రమే నిర్ణయించారు. ఈ హరితహారంలో ప్రధానంగా టేకు మొక్కల పెంపకాన్ని పూర్తిగా తగ్గించారు. గత హరితహారాల్లో ప్రతి రైతుకు టేకు మొక్కలు ఇచ్చి పొలం గట్లపై పెంచాలని చెప్పేవారు. ఈ ఏడాది కేవలం నీటి సౌకర్యం ఉన్న రైతులకు మాత్రమే టేకు మొక్కలు పంపిణీ చేసేందుకు నిర్ణయించారు.

అటవీశాఖ నర్సరీల్లో ..

అటవీశాఖ పరిధిలో 16 నర్సరీలు ఉన్నాయి. 20 లక్షల మొక్కలను ఈ నర్సరీల్లో పెంచుతున్నారు. ప్రధానంగా కానుగ, జామ, టేకు, ఉసిరి వంటి పలు రకాల మొక్కలను పెంచారు. జిల్లాలోని అటవీభూమిలో 5 లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 25 శాతం మొక్కలు నాటారు.

జీపీల్లో 58 లక్షలకుపైగా మొక్కలు

566 జీపీల్లో ఉన్న నర్సరీల్లో 58 లక్షల 23 వేల మొక్కలు పెంచుతున్నారు. ఈ ఏడాది కొత్తగా 33,23000 మొక్కలు పెంచుతున్నారు.

త్వరలో లక్ష్యం పూర్తిచేస్తాం

ఇప్పటికే అటవీశాఖ ఆధ్వర్యంలో 25శాతం మొక్కలు నాటడం పూర్తయ్యింది. మిగతా లక్ష్యాన్ని కూడా త్వరలో పూర్తి చేస్తాం. అటవీభూముల సంరక్షణకు ప్రజలందరూ సహకరించాలి. అడవి ఎంత విస్తీర్ణం ఉంటే మానవ జాతికి అంతమేలనే విషయాన్ని ప్రజలు గమనించాలి.

– జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖ అధికారి

25 హెక్టార్లలో 11 వేల మొక్కలు

- నాగసమందర్ అడవిలో ప్లాంటేషన్
- పనులను పరిశీలించిన సీసీఎఫ్ అధికారి సైదులు

ధారూరు: మండల పరిధిలోని నాగసమందర్-1 అడవిలో 25 హెక్టార్లలో 11వేల మొక్కల ప్లాంటేషన్ పనులను చార్మినార్ జోన్ చీఫ్ కన్జర్వేటర్ అధికారి సైదులు జిల్లా ఫారెస్టు అధికారి జ్ఞానేశ్వర్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలో చేపట్టిన ప్లాంటేషన్ పనులను కూడా ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాంటింగ్ పూర్తి అయ్యిందా? ఎన్ని హెక్టార్లలో ఎన్ని మొక్కలు నాటారని ఇన్‌చార్జి డీఎఫ్‌ఓ కృష్ణను అడిగి తెలుసుకున్నారు. 25 హెక్టార్లలో 11 వేల మొక్కలను నాటినట్లు, 20 రకాల మొక్కలను పెంచుతున్నట్లు ఆయన వివరించారు. అడవి జంతువులకు, కోతుల కోసం ఏఏ రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారని సీసీఎఫ్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాజేందర్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ ప్లాంటేషన్‌లో నేరేడు, ఉసిరి, మారేడు, వెలగ, సీతాఫలం వంటి పండ్ల మొక్కలను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఆయన ఆదేశించారు.



మొక్కలను పరిశీలిస్తున్న సీసీఎఫ్ సైదులు

క్లుప్తంగా

మాతాశిశు ఆస్పత్రిలో కౌన్సిలర్ కాన్పు

మగ బిడ్డకు జన్మనిచ్చిన వసంత



ఎంసీహెచ్‌లో పండంటి మగ బిడ్డతో కౌన్సిలర్ వసంత, శ్రీధర్ దంపతులు

తాండూరు టౌన్: ప్రభుత్వ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఓ కౌన్సిలర్ కాన్పు చేయించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. తాండూరు 16వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎర్రం వసంత రెండో కాన్పు నిమిత్తం మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. గురువారం ఆమెకు వైద్యులు సిజేరియన్ చేయగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా చూస్తోందని కౌన్సిలర్ వసంత అన్నారు.

సహకార సంఘం డైరెక్టర్ మృతి

నేతల నివాళి



సత్యనారాయణ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న విఠల్‌రెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాట సింగారం రైతు సేవాసహకార సంఘం డైరెక్టర్, అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన గుండె సత్యనారాయణ బుధవారం రాత్రి మృతిచెందాడు. కొంత కాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.50వేలు, వైస్ చైర్‌పర్సన్ నార్ల కొండ మల్లమ్మజంగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, పెద్దఅంబర్‌పేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, సంఘం డైరెక్టర్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి రూ.10వేల చొప్పున మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు చక్రవర్తిగౌడ్, సర్పంచ్ కిరణ్ కుమార్‌గౌడ్, సహకార సంఘం మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్ తదితరులు నివాళి అర్పించారు.

గంజాయి ముఠా అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

అత్తాపూర్: గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కునాల్ దోర, మహారాష్ట్రకు చెందిన విజయ్ (36), ప్రదీప26), సత్యనారాయణ(47), సావిత్ర(36), జయా సోలంకి(22), కునాల్ దాదారావు(19), ప్రదీప్ సాల్వే, బాబా అవస్కర్ ముఠాగా ఏర్పడి కునాల్ దోరా ఒడిస్సా రాష్ట్రంలోని బీరంపూర్‌లోని ఏజెన్సీ ఏరియాలో గంజాయిని పండించి మహారాష్ట్రకు తరలిస్తుంటాడు. ఒడిస్సా నుంచి ట్రెన్‌లో సరఫరా చేసి అనంతరం పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగిస్తుంటారు. గురువారం అక్రమంగా గంజాయిని తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, అత్తాపూర్ పోలీసులు చింతల్‌మెట్ వద్ద నిందితులను తనిఖీ చేయగా 110 కేజీ గంజాయి లభ్యమైంది. విజయ్, ప్రదీప, సత్యనారాయణ, సావిత్ర, జయా సోలంకి, కునాల్ దాదారావును అదుపులోకి తీసుకున్నారు. కునాల్ దోర ప్రదీప్ సాల్వే, బాబా అవస్కర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఎందుకీ సమావేశాలు?

- బషీరాబాద్ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన
- సమస్యలు పరిష్కారం కావడం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆగ్రహం
- అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కరుణ

బషీరాబాద్: సమస్యలు పరిష్కారం చేయలేని సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఎంపీపీ కరుణ అధ్యక్షతన బషీరాబాద్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ఎన్ని సమావేశాలు నిర్వహించినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని ఎంపీపీకి సూచించారు. అధికారులు తమ ఫోన్లు ఎత్తడం లేదని, ప్రజాప్రతినిధులమనే కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్లకు స్పందించకపోతే సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని సర్పంచులు శాంతిబాయి, పద్మ, శివనాయక్ ప్రశ్నించారు. గొట్టిగఖుర్ధు, వాల్యానాయక్‌తండాలో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేదని ఏఈకి ఫోన్ చేస్తే అస్సులు తీయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశానికి సైతం ఏఈ రాకపోవడంపై సీరియస్ అయ్యారు. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరగా మెమో జారీ చేయాలని ఎంపీపీ కరుణ ఎంపీడీఓను ఆదేశించారు. బాబునాయక్‌తండా, బోజ్యానాయక్‌తండా పాఠశాలల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయులు లేరని సర్పంచ్‌లు తెలిపారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ కింద పెంచిన మొక్కలు నర్సరీల్లోనే మూలుగుతున్నాయని సభ్యులు మండిపడ్డారు.

పారిశుద్ధ్యం గాడి తప్పొద్దు..

ఎంపీపీ కరుణ మాట్లాడుతూ.. వర్షాలు ప్రారంభమైనందున గ్రామాల్లో పారుశుద్ధ్యం గాడి తప్పకుండా చూసుకోవాలని సూచించారు. కార్మికులు సమ్మెలో ఉన్నందున ప్రైవేటు కూలీలతో మురుగు కాల్వలు శుభ్రం చేయించాలని తెలిపారు. మండల అభివృద్ధి కోసం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఇప్పటివరకు రూ.50 కోట్ల నిధులిచ్చారని స్పష్టంచేశారు. భారీ వర్షాలు కురుస్తున్నందున చెరువులు, వాగుల వద్దకు ఎవరూ వెళ్లవద్దని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బాబునాయక్‌తండా, భోజ్యానాయక్‌తండా, పర్మానాయక్‌తండాలకు బీటీ రోడ్లు మంజూరైనా ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై జిల్లా అధికారులను ప్రశ్నించామని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శాంతిబాయి, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ రమేశ్, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, పీఆర్ ఏఈ వంశీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావన, ఏపీఎం పద్మారావు, ఏపీఓ శారద, డాక్టర్ గోపాల్, శ్రీకాంత్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల కో ఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

27న కలెక్టరేట్ ముట్టడి

మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ



కరపత్రాన్ని విడుదల చేస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలో సంఘం నాయకులతో కలిసి కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ.. మత్స్యకార్మికులకు 90శాతం సబ్సిడీతో వాహనాలు, వృత్తి పరికరాలను అందజేయాలని కోరారు. ఇందుకు దరఖాస్తు గడువును ఆగస్టు 20వరకు పొడిగించాలని కోరారు. డీఎస్‌సీఎస్ ఎన్నికల్లో అన్ని సొసైటీలకు ఓటు హక్కు కల్పించి ఎన్నికలు నిర్వహించాలన్నారు. చేప పిల్లలకు బదులుగా నగదును సొసైటీ ఖాతాలో జమచేయాలన్నారు. ప్రతీ మత్స్యకార్మికుడికి రూ.5లక్షలు, సొసైటీలకు రూ.10లక్షల చొప్పున ఆర్థికసాయం అదజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌తో, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఉద్యోగం పేరిట మోసం

రూ. 1.25 లక్షలకు టోకరా

శంషాబాద్ రూరల్: ఇంటి వద్దనే ఉంటూ ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తామని ఓ మహిళ నుంచి రూ. 1.25 లక్షలు కాజేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఊట్‌పల్లిలో ఉండే మౌనికకు ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగం కల్పిస్తామంటూ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. సదరు మహిళ ఆ ఉద్యోగానికి అంగీకరించడంతో అందుకు రూ. 2 వేలు చెల్లించాలని, మరో మెసేజ్ రావడంతో పాటు కంపెనీ రివ్యూని రాసి పంపాలన్నారు. రివ్యూ రాసి పంపిన తర్వాత ఆమెకు రూ. 2800 పంపారు. ఆమెకు నమ్మకం రావడంతో పలు దఫాలుగా రూ. 1.25 లక్షలు పంపింది. ఉద్యోగం కోసం సంప్రదించగా మరోరూ.1.50లక్షలు పంపాలని మెసేజ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఆశ్రయించింది.

రజినికి శుభాకాంక్షల వెల్లువ



రజినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్/తలకొండపల్లి: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా, తెలంగాణ ఉద్యమ గాయకుడు దివంగత సాయిచంద్ సతీమణి రజిని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్సీ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీరఘురాములు, సుమన్ తదితరులున్నారు.

రాజకీయాలతోనే విప్లవాత్మక మార్పులు

- యువత రాజకీయాల్లోకి రావాలి
- పీసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

చేవెళ్ల: ప్రస్తుతం రాజకీయాలు వ్యాపారులుగా మారాయని.. ప్రజా సేవ చేసేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని పీసీసీ సభ్యుడు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఆయన చేవెళ్లలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మానవ సేవే.. మాధవ సేవని సేవకుడే నాయకుడు అవుతాడని సూచించారు. యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. రాజకీయాలతోనే విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయని చెప్పారు. నాయకత్వ లక్షణాలపై నాడు అబ్దుల్ కలాంతో కలిసి లక్ష మంది యువతకు శిక్షణ ఇచ్చామని గుర్తుచేశారు. అట్టడుగు వర్గాల ప్రజలు రాజకీయాల్లోకి వచ్చేందుకు తాను ప్రత్యేక శిక్షణ ఇస్తున్నానని చెప్పారు. గతంలోనూ కేఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేశానని గుర్తుచేశారు.

ఏడు అసెంబ్లీ సీట్లు గెలిపించేందుకు కృషి...

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి పని చేస్తానని కేఎల్ఆర్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీకోసం తొలినుంచి పనిచేసి వారికే టికెట్లు ఇప్పించుకోవాలని.. పార్టీలు మారిన వారికి టికెట్లు ఎలా ఇస్తారో ప్రశ్నించాలన్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజవకర్గంలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారన్నారు. అధిష్టానం నిర్ణయం మేరకు కట్టుబడి ఉంటానని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరి సతీశ్, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, నక్కా బుచ్చిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి, పడాల రాములు, నాయకులు షాబాద్ దర్శన్, భీమ్‌భరత్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాములు, నాయకులు శ్రీనివాస్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వయస్సు 28.. కేసులు 34

- నకిలీ ఏసీబీ అధికారి అరెస్ట్
- 16 చైన్‌స్నాచింగ్.. 18 నకిలీ ఏసీబీ కేసులు
- 200 సిమ్‌కార్డులు వాడిన నిందితుడు



నిందుతుల వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: డిగ్రీ పూర్తి చేసిన ఓ యువకుడు విలాసవంతమైన జీవితం కోసం నేరాల బాట పట్టాడు.. చైన్‌స్నాచింగ్‌లతో మొదలు పెట్టి ప్రభుత్వాధికారులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతూ మోస్ట్ వాంటెడ్ నేరగాడిగా మరాడు.. కేవలం 28 ఏళ్ల వయస్సులోనే అతడిపై 34 కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఓ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు నకిలీ ఏసీబీ అధికారి అవతారంలో తిరుగుతున్న అతడిని అరెస్ట్ చేశారు. గురువారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు... అనంతపురం జిల్లా, కోటలపల్లి గ్రామానికి చెందిన నూతేటి జయకృష్ణ(28) 2016లో బీకాం పూర్తి చేశాడు. అనంతరం ఓ టెక్స్‌టైల్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఎస్సై పరీక్షలకు సిద్ధమవుతున్న అతను అనంతపురం పట్టణంలో రెండు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఆయా కేసుల్లో జైలుకు వెళ్లిన అతడికి అక్కడ అనిల్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అనిల్ ద్వారా బెంగళూరులోని శ్రీనాథ్‌రెడ్డి పరిచయమయ్యాడు.

'గ్యాంగ్' స్ఫూర్తిగా తీసుకుని ..

తమిళ హీరో సూర్య నటించిన గ్యాంగ్ సినిమాను చూసిన వీరు దానిని స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వాధికారులను మోసం చేయాలని నిర్ణయించుకున్నారు. ఓ పక్క చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూనే మరోవైపు నకిలీ ఏసీబీ ప్రభుత్వాధికారులను బెదిరించి వసూళ్లు చేయడం మొదలుపెట్టారు. 2019లో నకిలీ ఏసీబీగా అవతారమెత్తిన జయకృష్ణ, ఒంగోలు, నెల్లూరు, ఏలూరు, అనంతపురం విశాఖపట్నం, విజయనగరం, తదితర ప్రాంతాల్లోని మున్సిపల్, రెవెన్యూ, రవాణా తదితర రంగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్లు చేసి మీపై ఆరోపణలున్నాయి సెటిల్ చేసుకోవాలంటూ వసూళ్లకు పాల్పడ్డాడు. గత మార్చి, జూన్, జులైలో సిద్దిపేటలో ఇద్దరు ఉద్యోగులు, సైబరాబాద్ పరిధిలో ఒకరికి ఇదే తరహాలో ఫోన్లు చేసి వసూళ్లకు పాల్పడ్డాడు. వీరిపై పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 18 కేసులు నమోదయ్యాయి.

బస్సుల్లో తిరుగుతూనే..

గుగూల్ ద్వారా ప్రభుత్వ అధికారుల ఫోన్ నంబర్లు సేకరించడంతో పాటు విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల ఆధార్ కార్డుల ద్వారా సుమారు 200 నకిలీ సిమ్‌కార్డులు తీసుకుని వాడినట్లు గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగులను టార్గెట్ చేసుకున్న అనంతరం వారు పథకం ప్రకారం ఉదయం ఆర్టీసీ బస్సు ఎక్కేవారు. రాత్రి వరకు బస్సులో ప్రయాణం చేస్తూనే అధికారులకు ఫోన్ చేసి బెదిరించేవారు. పని పూర్తి కాగానే సిమ్‌ను అక్కడే పారేసేవారు. గత రెండేళ్లలో మొత్తం 9 బ్యాంకు ఖాతాల్లో రూ. గూగుల్ పే, ఫోన్ పే ద్వారా రూ.1.2 కోట్లు వేయించుకున్నట్లు గుర్తించారు. డబ్బులు వచ్చిన వెంటనే గోవా తదితర ప్రాంతాలకు వెళ్లి జల్సాలు చేయడం జయకృష్ణకు అలవాటు. వరస నేరాలతో అప్రమత్తమైన శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు నకిలీ సిమ్‌కార్డుల ఆధారంగా బెంగళూరులో జయకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.85 వేల నగదు, ఖాతాల్లో ఉన్న రూ.2.24లక్షలు, 8 ఫోన్‌లు, 5 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు ఎవరూ కూడా నేరుగా అధికారులకు ఫోన్లు చేయరని ప్రభుత్వాధికారులు దీనిని గుర్తించాలని డీసీపీ నారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థులు కూడా గుర్తుతెలియని వ్యక్తులకు ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు ఇవ్వకూడదని సూచించారు. కేసును ఛేదించిన శంషాబాద్ ఎస్‌ఓటీ, శంషాబాద్ పోలీసులకు డీసీపీ అభినందించారు.

కోకాపేటలో కార్ రేసింగ్

- కౌన్సెలింగ్‌కు నిందితులు
- స్వాధీనం చేసుకున్న కార్లు కోర్టుకు అప్పగింత

మణికొండ: కోకాపేట నియోపోలీస్ కేంద్రంగా కార్ రేసింగ్‌కు పాల్పడిన ఆరుగురు యువకులను నార్సింగి పోలీసులు అరెస్టు చేసి కౌన్సిలింగ్‌కు తరలించారు. నార్సింగి సీఐ శివకుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్ నగరానికి చెందిన కొందరు యువకులు ఖరీదైన కార్లలో శుక్రవారం సాయంత్రం రేసింగ్‌కు పాల్పడుతున్నారు. దీంతో భయాందోళనకు గురైన స్థానికులు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కార్లతో సహా వారిని అదుపులోకి తీసుకున్నారు. నార్సింగి ట్రాఫిక్ సీఐ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రేసర్లను గురువారం కౌన్సెలింగ్‌కు పంపామని, సీజ్ చేసిన కార్లను కోర్టుకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. సదరు కార్లు పాండిచ్చేరి, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయి ఉన్నందున అవి మన రాష్ట్రంలో తిరిగేందుకు అవకాశం ఉందా..లేదా స్పష్టం చేయాలని ఆర్‌టీఏ అధికారులకు లేఖ రాశామన్నారు. రేసింగ్‌కు పాల్పడిన యువకులు సంపన్న కుటుంబాలకు చెందిన వారు కావడంతో వారి పేర్లను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. వారం రోజుల క్రితం రేసింగ్‌కు పాల్పడితే వారిని గురువారం కౌన్సెలింగ్‌కు, కార్లను కోర్టుకు అప్పగించడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రేసింగ్‌కు పాల్పడిన వారిలో సయ్యద్ మాజీద్ హుస్సేన్, రాకేష్, నారాయణ, ధన్‌రాజ్, రమణ, మణికొండ కంఠ శర్మ ఉన్నట్లు సమాచారం.



పోలీసులు సీజ్ చేసిన కార్లు

తన ప్రియురాలికి దగ్గరవుతున్నాడని...

శంషాబాద్: తన ప్రియురాలికి దగ్గరవుతున్నాడనే కోపంతో ఓ యువకుడు మరో ముగ్గురితో కలిసి తన స్నేహితుడిని హత్య చేసిన సంఘటన గురువారం కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాల ప్రకారం.. కొత్తూరులోని హెచ్ఐఎల్ కంపెనీలో పనిచేస్తున్న రాజ్‌కపిల్ సాహూ (20) ఈ నెల 18 మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని అదే పరిశ్రమలో పని చేస్తున్న సోమకుమార్ కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రాజ్‌కపిల్‌తో గదిలో కలిసి ఉంటున్న సోనిల్ చౌదరిని విచారించగా రాహుల్ సింగ్ అనే వ్యక్తి కలిసేందుకు వెళ్లిన అతను తిరిగి రాలేదని తెలిపాడు. దీంతో వారు బుధవారం రాత్రి రాహుల్ సింగ్ తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా అతడిని హత్య చేసినట్లు వెల్లడించాడు. తన ప్రియురాలిని గత కొంత కాలంగా రాజ్ కపిల్ ప్రేమిస్తున్నాడని, దీంతో ఆమె తన దూరం పెడుతున్నదన్న కక్షతోనే తన స్నేహితుడి మహ్మద్ తాహేర్, మరో ఇద్దరు మైనర్లతో కలిసి రాహుల్‌ను జనసాయి వెంచర్ వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించిన అనంతరం సీసాలతో పొడిచి బండరాయితో మోది దారుణంగా హత్య చేసినట్లు వెల్లడించాడు. దీంతో పోలీసులు మిగతా ముగ్గురు నిందితులను కూడా అరెస్ట్ చేశారు. ఇద్దరు మైనర్లను జువైనల్‌కు హోంకు తరలించారు. సమావేశంలో శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు, కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి సమష్టిగా పనిచేయండి



మాణిక్‌రావు ఠాక్రేను సన్మానిస్తున్న మొయినాబాద్ నాయకులు

మొయినాబాద్ రూరల్: వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే సూచించారని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నక్కలపల్లి సతీష్ అన్నారు. గురువారం గాంధీ భవన్‌లో మర్యాదపూర్వకంగా ఠాక్రేను కలిశారు. తెలంగాణలో జరుగుతున్న దోపిడీ రాజకీయాలను ప్రజలకు వివరించాలని చెప్పారన్నారు.

తల్లి మందలించిందని..

ఉపాధ్యాయురాలి బలవన్మరణం

బంజారాహిల్స్: వర్షం పడుతోంది... పిల్లలు ఇంట్లోనే ఆడుకునేలా చూడు.. బయటికి వె ళ్తే లేనిపోని రోగాలు వస్తాయి... అంటూ త ల్లి మందలించడంతో మనస్తాపానికి లోనైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో గురు వారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎస్సీటీ నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్న మాదివాల్ గాయత్రి(31) ఎస్సీ టీ నగర్‌లో తల్లితో కలిసి ఉంటోంది. ఆమెకు ఏడాదిన్నర, మూడు నెలల పాపలు ఉన్నారు. ప్రస్తుతం మెటర్నిటీ లీవ్‌లో ఉన్న గాయత్రి భర్త సుధీర్ కుమార్ ప్రైవేట్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో గాయత్రి తల్లి మనవరాళ్లను కనిపెట్టుకుని ఉంటోంది. అయితే చిన్నారులు తరచూ బయటికి వెళ్తుండటంతో ఇంట్లోనే ఉండేలా చూడా లని కూతురికి పలుమార్లు నచ్చజెప్పింది. పిల్లలను పెంచే పద్ధతి తనకు తెలుసని తల్లి హితవు చెప్పడం నచ్చని గాయత్రి మనస్తాపానికిలోనై ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారుల ఆరోగ్య రక్షణకే టీకాలు

ఇబ్రహీంపట్నం రూరల్: చిన్నారుల ఆరోగ్యం బాగుండాలంటే తప్పని సరిగా టీకాలు వేయించాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మిషన్ ఇంద్ర ధనుష్ టీకాలపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. కోవిడ్ విపత్కర పరిస్థితిలో కొంత మంది చిన్నారులకు టీకాలు ఇవ్వలేక పోయామని, అలాంటి పిల్లలకు వెంటనే ఇవ్వాలని సూచించారు. ఏడాదిలోపు పిల్లలందరికీ టీకాలు వేయాలన్నారు. వచ్చే నెలలో మొదటి, రెండు టీకాలు ఒకే సారి ఇవ్వాలన్నారు. సర్వజననీయ టీకాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. ఆగస్టు 7నుంచి 12వతేదీ వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16వతేదీ వరకు, అక్టోబర్ 9నుంచి 14వ తేదీ వరకు టీకా కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. టీకాలు వేయడం ద్వారా చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడవచ్చని తెలిపారు. అనంతరం నులిపురుగుల నివారణ పోస్టర్‌ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, విద్యాధికారి సుశీందర్‌రావులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ప్రభాకర్, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలీశ్వరీ, సుజని, డాక్టర్ స్వర్ణకుమారి, డాక్టర్ సృజన్, అరుణ పాల్గొన్నారు.

కల్వకుర్తికి నిధులివ్వండి

కడ్తాల్: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ గురువారం ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాల జాబితాను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి మూడెకరాల స్థలాన్ని సేకరించి ఇప్పటికే వైద్యారోగ్య శాఖకు అప్పగించామని తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు ఇవ్వాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. కేఎల్ఐ ఎత్తిపోతల పథకంలో భాగంగా, జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం నాగిళ్ల వరకు కేఎల్ఐ డీ- 82 కాల్వలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారంగా రూ.16.50 కోట్లు విడుదల చేయాలని, వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.50 లక్షలు, కడ్తాల్ నుంచి పడకల్ గేట్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.20 కోట్లు మంజూరు చేయాలని విన్నవించామని తెలిపారు.